ఇంటర్ విద్యార్థులు డిగ్రీ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలి

బిచ్కుంద, జూన్ 25: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వివిధ కోర్సులలో అడ్మిషన్ల కోసం ఇంటర్ విద్యార్థులు దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బిచ్కుంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలైన సందర్భంగా పాస్ అయిన విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్‌సీ, ఎంపీసీ, బీజడ్‌సీ, కంప్యూటర్ కోర్సులో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. మూడో ఫేజ్ రిజిస్ట్రేషన్ చివరి రోజు దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మిగిలిన వివరాలకు 9492795524, 9701155512 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.


క్యాసంపల్లిలో లారీని ఢీకొన్న బస్సు

టెర్రర్

రోడ్లు మింగేస్తున్నాయ్!

- జిల్లాలో నెత్తురోడుతున్న రహదారులు
- ఏదో ఒకచోట ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు
- ఈ ప్రమాదాల్లో సగటున ఇద్దరు మృత్యువాత.. పదుల సంఖ్యలో క్షతగాత్రులు
- అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్న ఆగని రోడ్డు ప్రమాదాలు
- ఈ ఏడాది ఆరు నెలల్లో వందకుపైగా ప్రమాదాలు.. 54 మంది మృత్యువాత
- వీధినపడుతున్న కుటుంబాలు

కామారెడ్డి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రధాన రహదారులు మృత్యుదారులుగా మారుతున్నాయి. ప్రధాన రహదారులపై ప్రయాణించాలంటేనే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట రహదారులపై ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ప్రధానంగా జాతీయ రహదారులతో పాటు రాష్ట్రీయ రహదారులలో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాలపై అధికార యంత్రాంగం, పోలీసుశాఖ అవగాహన కల్పిస్తున్నా ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. ప్రతీఏటా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతునే ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో చాలా మంది దుర్మరణం చెందడమే కాకుండా క్షతగాత్రులై కుటుంబాలు రోడ్డున పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ ఏడాదిలో ఆరు నెలల మాసంలో జిల్లా వ్యాప్తంగా 100కు పైగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా 54మంది మృతి చెందినట్లు పోలీసుశాఖ రికార్డులు చెబుతున్నాయి.

జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు

కామారెడ్డి పట్టణ శివారుల్లోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా 28 మందికి గాయాలయ్యాయి. ఈనెల 21న జుక్కల్ చౌరస్తా వద్ద 161 జాతీయ రహదారిపై అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడడంతో మహిళ మృతి చెందగా 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈనెల 15న పెద్దకొడప్‌గల్ మండలం బేగంపూర్ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈనెల 3న బిచ్కుందలో ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. మార్చి 25న భిక్కనూర్ మండల కేంద్రానికి చెందిన నవ్య అనే మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. అదేరోజు బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామ శివారులో ఆర్టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపు తప్పి బాల్‌రాజు అనే వ్యక్తి మృతి చెందాడు. మార్చి 16న లింగంపేట మండలం బయ్యంపల్లి శివారులో ఆటో బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరికొందరికి గాయాలయ్యాయి. మార్చి 15న బాన్సువాడ మండలం కొల్లూర్ గ్రామం వద్ద ఎదురెదురుగా వస్తున్న బైక్‌ను మరో వాహనం ఢీకొనడంతో రాము అనే వ్యక్తి మృతి చెందాడు. మార్చి 8న సదాశివనగర్ మండలంలోని 44వ జాతీయ రహదారిపై స్కూటీకి వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో సయ్యద్ సమీయోద్దిన్ అనే వ్యక్తి మృతి చెందాడు. మార్చి 4న సదాశివనగర్‌కు చెందిన దంపతులు జనార్ధన్‌రెడ్డి, ప్రతిభలు బైక్‌పై పద్మజీవాడికి వెళ్తుండగా జాతీయ రహదారిపై వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ప్రతిభ అక్కడికక్కడే చనిపోగా జనార్ధన్‌రెడ్డి చికిత్స పొందుతూ మరణించాడు. ఫిబ్రవరి 10న గాంధారిలో బైక్ డీవైడర్‌ను ఢీకొనడంతో విక్రమ్‌గౌడ్ అనే వ్యక్తి మరణించాడు. ఫిబ్రవరి 6న కామారెడ్డి శివారులోని కల్వరల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాములు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆరు నెలల్లోనే 100కు పైగా ప్రమాదాలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలపై అధికార యంత్రాంగంతో పాటు పోలీసు శాఖ, రవాణా శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసుశాఖ ఎన్నో చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అయినా ప్రమాదాలు తగ్గకపోవడం ఆందోళనలు కల్గిస్తోంది. కొన్నిచోట్ల ఎదురుదెరుగా వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతుండగా మరికొన్ని చోట్ల వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంకొన్ని చోట్ల రాంగ్‌రూట్‌లో ప్రయాణం, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం వంటి కారణాలతో ప్రమాదాల భారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. 2024 సంవత్సరంలో 6 నెలల్లోనే 100కు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగగా 54 మంది మృత్యువాత పడ్డారు. 110 మంది క్షతగాత్రులయ్యారు. 2023లో 501 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా 236 మంది మృతి చెందారు. మరో 480మంది క్షతగాత్రులయ్యారు. 2022లో 516 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా 271 మంది మృతి చెందారు. 503 మంది క్షతగాత్రులయ్యారు.

అతివేగం, నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం

జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, నిర్లక్ష్యమేనని పోలీసుశాఖ చెబుతోంది. వాహనాలను అతివేగంగా నిర్లక్ష్యంగా నడపడం వల్లే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసుశాఖ దర్యాప్తులో తెలుతోంది. ముఖ్యంగా జాతీయ రహదారులపై లారీలు, కారులు వేగంగా దూసుకెళ్తుంటాయి. వేగం పరిమితి విధించిన జరిమానాలు పడుతున్నా వాహనదారులు వేగం తగ్గించడం లేదు. అతివేగంగా వాహనాలను నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. ద్వి చక్రవాహనాలపై వెళ్లే వారు కూడా కొందరు అజాగ్రత్తగా నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాగి వాహనాలను నడపడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కోర్టులు జైలు శిక్ష విధిస్తున్నా మార్పులు రావడం లేదు.

రోడ్డున పడుతున్న కుటుంబాలు

ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలతో పాటు క్షతగాత్రులకు వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితుల్లో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతోంది. తీవ్ర గాయాలతో ఆసుపత్రుల పాలవుతున్న వారికి వైద్యం కోసం పెద్ద ఎత్తున ఖర్చు అవుతోంది. వారిని కాపాడుకునేందుకు ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తోంది. వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.

రైతు భరోసాను పకడ్బందీగా అమలు చేస్తాం

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

తాడ్వాయి, జూన్ 25: రాష్ట్రంలో రైతు భరోసా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి విధివిధానాలు రూపొందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని ఎర్రాపహడ్ గ్రామంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా కార్యక్రమాన్ని ఎలా అమలు చేస్తే బాగుంటుందని రైతుల నుంచి వివరాలు సేకరించారు. ప్రభుత్వ ధనం వృథా కాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై మంత్రి రైతులతో మాట్లాడి పలు సమాధానాలు సేకరించారు. రైతు భరోసా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి అందరి సూచనలు సేకరిస్తున్నామని మంత్రి వివరించారు. వర్షాకాలంలో వేసుకునే పంటలపై రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. పది ఎకరాల వరకు రైతులకు భరోసా అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఏక కాలంలో రూ.2లక్షల రుణ మాఫీ, వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అంది స్తామని ప్రకటించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ రైతులు ఆర్గానిక్ పంటలు వేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో ఆర్గానిక్ పంటలకు మంచి డిమాండ్ ఉందని ఆర్గానిక్ పంటలు వేసుకుని మంచి లాభాలు పొందాలన్నారు. రైతులు వరి ధాన్యం బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. అంతకుముందు అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3లక్షల 85 వేల ఖర్చుతో చేపట్టిన టాయిలెట్ బ్లాక్స్, ఓవర్ హెడ్ ట్యాంక్, నాలాలు, ప్రాథమిక పాఠశాలలో 1లక్ష 15 వేలతో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఏవో భాగ్యలక్ష్మీ, ఏడీఏ వీరాస్వామి, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో సాజిద్‌అలీ, తాడ్వాయి సింగిల్ విండో చైర్మన్ కపిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

లే అవుట్ ప్లాట్లకు అనుమతులివ్వాలి

• కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూన్ 25: టీఎస్‌బీఎస్ కింద ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ఉన్న లే అవుట్ ప్లాట్లకు 21 రోజులలోగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి లే అవుట్ కమిటీ సమావేశంలో సభ్యులను ద్దేశించి మాట్లాడుతూ సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిబంధనల మేరకు లే అవుట్‌లు ఉన్నాయా లేవా అని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారిత సమయంలోగా ప్లాట్లకు అనుమతి ఇవ్వాలన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో 2 చొప్పున లే అవుట్ అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. శుక్రవారం తిరిగి సమావేశమయ్యే నాటికి ప్రభుత్వ నిబంధనలు మేరకు లే అవుట్‌లో అండర్ డ్రైనేజీ, విద్యుత్, సెప్టిక్ ట్యాంక్, ఇంకుడు గుంత పచ్చదనం, 10 శాతం మార్టిగేజ్ వంటికి పొందుపరిచారా, వాటిని ఏర్పాటు చేస్తున్నారా అని పరిశీలించాలన్నారు. ప్రధానంగా రెవె న్యూ, నీటి పారుదల, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు, మున్సిపాలిటీ, విద్యుత్ శాఖలు తమ పరిధిలో వచ్చే అంశాలను పరిశీలించి వారం రోజుల్లో వివరాలను పొందుపరుస్తూ కలెక్టర్ లాగిన్‌కు పంపాలని, అక్కడ పరిశీలించి తుది లేఅవుట్ అనుమతికి మున్సిపల్ కమిషనర్‌కు పంపడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డీవో రంగనాథరావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్అండ్‌బీ ఈఈ రవిశంకర్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి నరసింహారావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ రమేష్‌బాబు, కలెక్టరేట్ పర్యవేక్షకురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంల పరిశీలన

కామారెడ్డి ఎస్పీ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను మంగళవారం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 276, కామారెడ్డి నియోజకవర్గంలోని 274, జుక్కల్ నియోజకవర్గంలోని 262 మొత్తం 812 వీవీ ప్యాట్ల నుంచి థర్మల్ పేపర్ రోల్స్, అడ్రస్ ట్యాగుల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఈవీఎం గోదాంకు తాళం వేసి సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రంగనాథరావు, ఎన్నికల విభాగం అధికారులు ప్రేమ్‌కుమార్, అనిల్‌కుమార్, తహసీల్దార్ జనార్ధన్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల అధికారులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ గేట్‌కు తగిలించిన ముగిసిన అడ్మిషన్ల బోర్డు

కస్తూర్బా విద్యాలయాల్లో.. ప్రవేశాలు ఫుల్!

- మెరుగైన విద్య, వసతులతో ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- ఇంగ్లీష్ మీడియం, ఉత్తమ ఫలితాలతో ఫుల్ డిమాండ్
- కేజీబీవీలో దర్శనమిస్తున్న నో అడ్మిషన్ల బోర్డులు

ఎల్లారెడ్డి, జూన్ 25: నాణ్యమైన విద్య మెరుగైన వసతులతో కస్తూర్బా గాంధీ విద్యాలయాలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు సాధించటంతో విద్యార్థులు తల్లిదండ్రులు సైతం కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో చేర్పించుటకు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు విద్యార్థుల కోసం ఇంటింటికీ వెళ్లి ప్రవేశాలు తీసుకున్న స్థాయి నుంచి నో అడ్మిషన్లు బోర్డు పెట్టేస్థాయికి కస్తూర్బా గాంధీ విద్యాలయాలు చేరాయి.

జిల్లాలో 19 కేజీబీవీ పాఠశాలలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2011లో సంయుక్తంగా 19 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను, అనాథ, డ్రాపౌట్, పేద, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం ఏర్పాటు చేశారు. మొదట్లో విద్యార్థినులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను చేర్చుకునే వారు. క్రమంగా ఈ విద్యాలయాల విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలు అక్కడ ఉన్న సౌకర్యాల గురించి తెలుసుకుని క్రమంగా విద్యార్థులు అధిక సంఖ్యలో చేరుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్రవేశాలు క్రమంగా పెరిగాయి.

ఇంగ్లీష్ మీడియం, మెరుగైన వసతులు

జిల్లాలోని రెండు సంవత్సరాల క్రితం నుంచి ఇంగ్లీష్ మీడియంలో కస్తూర్బా విద్యాలయాలు బోధిస్తున్నాయి. దీనికి తోడు ఉదయం అల్పాహారంతో ఇడ్లి, వడ, పూరి, కిచిడి అందిస్తున్నారు. అదే విధంగా స్నాక్స్‌గా స్వీట్లు, అరటిపండ్లు, ఆపిల్, బూస్ట్, గ్రేప్స్ వంటి పదార్థాలు ఇస్తున్నారు. నెలలో ఆరుసార్లు చికెన్, ఒకసారి మటన్ భోజనంలో పెడుతున్నారు. వారంలో నాలుగు రోజులు కోడిగుడ్లు పెడుతున్నారు. వారంలో నాలుగు రోజులు కోడిగుడ్లు పెడుతున్నారు. ఉదయం స్నానానికి వేడి నీరు సైతం ఇస్తారు. బాలికలపై ఎప్పుడు ఏఎన్ఎంల పర్యవేక్షణ ఉంటుంది. నెలకు ఒకసారి వైద్యాధికారి బాలికలను పరీక్షిస్తారు. యోగా కూడా చేయిస్తారు. చదువుల్లో వెనుకబడ్డ వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. 5,500మంది విద్యార్థినులు చదువుతున్నారు. కామారెడ్డి జిల్లాలోని మొత్తం 19 కస్తూర్బా పాఠశాలల్లో ఇంటర్మీడియట్ వరకు ఉన్న ఒక పాఠశాలలో 280 మంది విద్యార్థి నులు పదవ తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో 200మంది విద్యార్థులు చదువుతున్నారు. చాలా మంది విద్యార్థులు తల్లిదండ్రులు ఎమ్మెల్యేల సిఫారసు వస్తుండటంతో వీటికి ఉన్న డిమాండ్ తెలుస్తోంది.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

• ఉమారాణి, జేఈసీవో, కామారెడ్డి

కేజీబీవీల పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. విద్యార్థులకు కావాల్సిన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పేద అనాథ పిల్లలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోంది. విద్యా వసతులు కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయి. బాలికల రక్షణకు ప్రాధాన్యత ఇస్తాం.

అమ్మానాన్న లేని లోటు తీరింది

• హేమలత, విద్యార్థిని

అమ్మానాన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. నన్ను మా బంధువులు అత్తమ్మ ఎల్లారెడ్డి కస్తూర్బా పాఠశాలలో చేర్పించారు. ఇక్కడ నాకు అన్ని వసతులు కల్పించారు. మంచి భోజనం, చదువు ఉంది. అమ్మానాన్న లేని లోటును కేజీబీవీ టీచర్లు తీర్చారు.

'రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం'

బోధన్‌రూరల్,జూన్25: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ధ్యేయం, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 2లక్షల రైతు రుణమాఫీ ఏకకాలంలో సీఎం రేవంత్ రెడ్డి చేయడం అభినందనీయమన్నారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర, బోధన్ మండలాల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్నా రవి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ వచ్చిందని, రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, మాజీ జడ్పీటీసీ అల్లె రమేష్, కేజీ గంగారాం, చీల శంకర్, బీహారి, హన్మంత్‌రావు,బుయ్యన్ సురేష్, సొక్కంరవి, శ్రీనివాస్ రెడ్డి, రైతులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎడపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఒకేసారి రైతులు తీసుకున్న రెండు లక్షల రుణమాఫీకి కేబినెట్ ఆమోదం తెలపడంతో మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు తీసుకున్న రెండు లక్షల వరకు రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేయడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పాటు పడే ప్రభుత్వం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌రావు, నాయకులు బంజ కామప్ప, మల్కారెడ్డి, శంకర్ నాయుడు, మోహన్ రెడ్డి, ఎల్లయ్య యాదవ్, నారాయణ, మచ్కూరి గంగాధర్, కంచరి



సాలూరలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీనివాస్, బొబ్బిలి శ్రీనివాస్, నవీన్, రత్నాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రెండులక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో మంగళవారం కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీరాముల మురళి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామంటూ నాన్చుడుధోరణి అవలంభించడంతో రైతులకు అధిక వడ్డీభారం పడిందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నాట్లు ప్రకటించడం హర్షదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెన్నెల దేవేందర్, శ్రీరాముల సుమన్ పాల్గొన్నారు.

'డైట్ కళాశాల ప్రిన్సిపల్‌ను బదిలీ చేసి విచారణ జరిపించాలి'

నిజామాబాద్ అర్బన్, జూన్ 25: డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌పై అనేక ఆరోపణలు ఉండగా ఆయనపై విచారణకు ప్రభుత్వం ఆదేశించిన దృష్ట్యా వెంటనే ఆయన్ను బదిలీ చేసి విచారణ పారదర్శకంగా జరిగేలా చూడాలని పీడీఎస్‌యూ డైట్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తరుణ్, అర్వింద్‌లు అన్నారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో డైట్ కళాశాలలో జరిగిన విచారణలో కళాశాల ప్రిన్సిపల్ సమక్షంలోనే జరిగాయని విచారణ అధికారులను మేనేజ్ చేసి శ్రీనివాస్ తప్పించుకున్నారన్నారు. ఇప్పుడు విచారణ కూడా ప్రిన్సిపల్ లేకుండానే నిర్వహించాలన్నారు. రూ.30లక్షల నిధుల గోల్‌మాల్‌తో పాటు ట్రైనీ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం, ఇతరత్రా వేధింపుల వల్ల అనేక మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. వెంటనే ఆయన్ను బదిలీ చేసి విచారణ జరిపించాలన్నారు.

బడాపహాడ్ హుండీ ఆదాయం రూ.21లక్షలు

వర్ని,జూన్25: వర్ని మండలం బడాపహాడ్(పెద్దగుట్ట)హుండీ ఆదాయం లెక్కింపు ప్రక్రియ మంగళవారం పూర్తయింది. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు స్థానిక వక్ఫ్‌బోర్డు ఇన్‌చార్జి సద్దాం, సూపరిండెంట్ జమాల్, పోలీసు బందోబస్తు, వీడియో చిత్రీకరణ మధ్య నాలుగు హుండీలలో భక్తులు సమర్పించిన కానులను వేర్వేరుగా లెక్కించారు. రెండు నెలల ఆరు రోజుల హుండీ ఆదాయం రూ.21లక్షలు వచ్చినట్లు సూపరిండెంట్ జమాల్ తెలిపారు. టెండర్ విధానం కంటే ఈ ఆదాయం వక్ఫ్‌బోర్డుకు లాభదాయకంగా పేర్కొన్నారు. లెక్కించిన మొత్తం నగదు, కానుకలను బందోబస్తు మధ్య రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయానికి తరలించి వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మాతుల్లా హుస్సేనికి సమాచారం అందజేసినట్లు జమాల్ వెల్లడించారు. కాంట్రాక్ట్ విధానంలో దోపిడిని నియంత్రించడానికి ప్రస్తుత ఆదాయం ఉదాహరణగా స్పష్టం చేశారు. వక్ఫ్‌బోర్డు సిబ్బంది పారదర్శకంగా తమ విధులను నిర్వర్తించినట్లు పేర్కొన్నారు. కొత్త టెండర్ ప్రక్రియ ప్రారంభం వరకు నిర్వహణ బాధ్యతలు వక్ఫ్‌బోర్డు అధీనంలో ఉంటుందని తెలిపారు. భక్తులు స్వచ్ఛందంగా దోపిడీకి దూరంగా ఉంటూ తమకు తోచిన కానుకలు హుండీలో వేయాలని జమాల్ కోరారు.

కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నిజామాబాద్ అర్బన్, జూన్ 25: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అదే విధంగా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల ఫీజు దోపిడిని అరికట్టాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది లేక విద్యార్థుల సంఖ్య పెరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, నిఖిల్, రవీందర్, హన్మాండ్లు, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రాముఖ్యతపై అవగాహన

ఆర్మూర్‌టౌన్ జూన్25: మున్సిపల్ పరిధిలోని ఎంజే ఆసుపత్రిలో మహిళ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భస్థ లింగ నిర్ధారణ, లింగ వివక్ష బేటీ బచావో బేటీ పడావో, ఫోక్సో చట్టం మిషన్ వత్సల్య, మిషన్ శక్తిస్కీమ్‌లపై ఎఎన్‌ఎంలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందిత మధుశేఖర్, డాక్టర్ జైదీప్, జెండర్ స్పెషలిస్టు సౌమ్య, కవిత, టి.పుష్ప, జమ్రు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

ముప్కాల్, జూన్25: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీటీంకు సమాచారం అందించాలని ముప్కాల్ ఎస్సై భాస్కరచారి సూచించారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని అన్నారు. విద్యార్థినుల రక్షణ కోసం షీటీం ఏర్పాటు చేశామన్నారు. ఏ విధమైన ఆపదలో ఉన్నా.. వంద నెంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలకు, మోసాలకు గురైతే 1930నెంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ కానిస్టేబుల్ గంగామణి, పాఠశాల స్పెషల్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట పెట్టుబడి సాయంపై వీడియో కాన్ఫరెన్స్

ముప్కాల్, జూన్25: ముప్కాల్ రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో పంటల పెట్టుబడి సాయంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడారు. రైతుల నుంచి రైతు భరోసా గురించి సలహాలు, సూచనలు తీసుకున్నారు. బాల్కొండ నియోజకరవ్గం నుంచి ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామ రైతు గడ్డం చిన్నారెడ్డి మాటాడుతూ.. రైతు భరోసా పది ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు అమలు చేయాలని కోరారు. బీడు భూములకు ఇవ్వకుండాసాగు చేసి రైతులకే పెట్టుబడి సాయం అందించాలన్నారు. ఇన్‌కంటాక్స్ కట్టే రైతులకు రైతు భరోసా ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ డివిజన్ ఏడీఏ మల్లయ్య, మండలాల అగ్రికల్చర్ ఆఫీసర్‌లు మహేందర్, సాయికృష్ణ, లావణ్య, ఏఈవోలు నిషజకాంత్, అరుణ, అలేఖ్య, సాయికృష్ణ, రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

ఎడపల్లి: పది ఎకరాల లోపు రైతులకే రైతు భరోసా ఇవ్వాలని నియోజకవర్గ రైతులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రైతు భరోసాపై నియోజకవర్గ స్థాయి రైతులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిద్ధి రామేశ్వర్, నియోజకవర్గ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బట్టాపూర్‌లో 50 ట్రిప్పుల ఇసుక సీజ్

ఏర్గట్ల, జూన్ 25: మండలంలోని బట్టాపూర్ గ్రామంలో మంగళవారం 50 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్ తెలిపారు. బట్టాపూర్ గ్రామ శివారులోని ఊరగుట్ట వద్ద అక్రమంగా ఇసుక నిల్వలు ఉన్నట్లు సమాచారం మేరకు ఆర్ఐ సదానంద్ అక్కడికి వెళ్లారని చెప్పారు. అక్కడ ఉన్న ఇసుకను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇసుకను వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే సభ్యులు ఉదయం 10.30 గంటలకు వచ్చి పాల్గొనాలని తహసీల్దార్ సూచించారు.

బడిబాట ప్రవేశాలు అంతంతే !

● కోటగిరి బడిబాట కార్యక్రమంలో ప్రవేశాలు అంతంత మాత్రంగానే జరిగాయి ● గురుకుల పాఠశాలలపైనే తల్లిదండ్రుల ఆసక్తి



కోటగిరి మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలు స్వీకరిస్తున్న దృశ్యం



కారేగాంలో ఒకే విద్యార్థినికి పాఠాలు బోధిస్తున్న విద్యావలంటీర్



కారేగాంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల

కోటగిరి,జూన్25:బడీడు, చదువు మధ్యలో ఆపేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్న ప్రధాన లక్ష్యంతో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండలంలో బడిబాట వల్ల విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయిలో జరగలేదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నూతననమోదు అంతంత మాత్రంగానే ఉంది.ఈనెల 6నుంచి 19వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొనప్పటికీ సంతృప్తికరమైన రీతిలో ప్రవేశాలను పెంచలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికి తోడు బడిబాట జరుగుతుండగానే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించడంతో 9ఏళ్లుగా పదోన్నతులు, బదిలీల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు ఆ ప్రయత్నాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టాల్సి వచ్చింది. జిల్లాలో సుమారు 5వేల మందికి పైగా బడిబాటలో విద్యార్థులు చేరినట్లు అధికారులు చెప్తున్నారు.

● గురుకులాల పాఠశాలలపైనే ఆసక్తి

సాధారణంగా ప్రైవేటు పాఠశాలలపై ఆసక్తి ఉండడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య ప్రతియేటా తగ్గుతూ వస్తుంది. ఈ విద్యా సంవత్సరంలోనూ అదే పరిస్థితి ఉండగా దీనికి తోడు వసతి గృహం సౌకర్యం, ఇంగ్లీష్ మీడియం బోధన ఇంకా అన్ని ఉచిత సదుపాయాలతో ఉండే గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకే ఆయా తరగతుల్లో చేరాలకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే 4,5,6వ తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించే వివిధ సంక్షేమ గురుకులాల పాఠశాలల ప్రవేశ పరీక్షలు విద్యార్థులు రాస్తున్నారు. అక్కడ సీటు రాగానే గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు. పొతంగల్ మండలంలోని కారేగాం ప్రాథమిక పాఠశాలల్లో ఈ విచిత్ర పరిస్థితి నెలకొంది. ఇక్కడ పని చేసే ఉపాధ్యాయుడు గత యేడాది మృతి చెందాడు. ఆయన స్థానంలో గత యేడాది డిప్యూటేషన్‌పై ఒక ఉపాధ్యాయుడిని కొనసాగించారు. ఈ యేడాది పాఠశాల ప్రారంభంలో 8మంది విద్యార్థులు పాఠశాలకు హజరయ్యారు. ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఒకే ఒక విద్యార్థిని మిగలడం విశేషం. మిగిలిన విద్యార్థులను తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు, గురుకుల పాఠశాలలకు తరలించారు. పాఠశాల అభివృద్ధికి అమ్మ ఆదర్శ పాఠశాల కింద 5లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇక్కడ నిధులు ఖర్చు చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఇక్కడ ఒకే ఒక విద్యార్థిని ఉండడంతో వీవీని ఏర్పాటు చేసి పాఠశాల నిర్వహిస్తుండడం కొసమెరుపు. పదోన్నతులతో పాటు బదిలీల్లో భాగంగా ఇక్కడికి ఉపాధ్యాయులు వచ్చే అవకాశం లేకుండా పోయే అవకాశం ఉంది. బోధన్ డివిజన్‌లోనూ ఏకోపాధ్యాయ పాఠశాలలు పదుల సంఖ్యలో ఉండడంతో తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన చదువులు అందే అవకాశం లేదని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది గురుకుల పాఠశాలలకు ప్రాధాన్యత ఇస్తుండగా ఆర్థికంగా ఉన్న వారు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. ఇప్పటికైన విద్యాశాఖ అధికారులు మేల్కొని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

నేడు ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్

లింగంపేట, జూన్ 25: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చల విడిగా ఫీజులువసూలును నిరసిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలికవసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు లింగంపేట మండల ప్రధాన కార్యదర్శి నవీన్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వ అనుమతులులేని ప్రైవేటు పాఠశాలలను అధికారులు సీజ్ చేయాలని కోరారు.

డిచ్‌పల్లి: ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల ఫీజుల దోపిడిని అరికట్టడంలో ప్రభుత్వ సంస్థలో మౌళిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఈ కారణంగా ఈనెల 26 రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో బందును పిలుపునిచ్చిందని ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడు శివా తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనపై ప్రభుత్వంపై దృష్టి సారించాలని ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాహనదారులకు ఆవుల మందతో ప్రమాదాలు



లింగంపేటలో ప్రమాదానికి గురైన మనోహర్

లింగంపేట్, జూన్ 25:లింగంపేట మండల కేంద్రంలో ఎల్లారెడ్డి- కామారెడ్డి రహదారిపై రాత్రి పగలు రోడ్డుపై ఆవులు, లేగదూడలు, ఎద్దులు సంచరించడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సోమ వారం రాత్రి రోడ్డుపై అవుల మంద ఉండడంతో వాటిని చూసి ద్విచక్ర వాహనంపై తక్కు వేగంతో వెళ్లుతున్న మనోహర్ ద్విచక్రవాహనానికి ఆవు లు ఎదురుగా వచ్చి గుద్దడంతో మనోహర్ కిందపడి తీవ్రంగా గాయప డ్డాడు. వెంటనే అతనిని స్థానికి ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథ మిక చికిత్సలు నిర్వహించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కామా రెడ్డికి తరలించారు. మండల కేంద్రంలోని ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై పోలీస్ స్టేషన్ నుంచి సబ్‌స్టేషన్ మధ్యలో 50వరకు ఆవులు, లేగలు, ఎద్దులు రోడ్డుపై రాత్రి పగలు తిరుగుతున్నాయని వాటి ద్వారా ప్రతీ రోజు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేసున్నారు. పశువుల యజమానులు రోడ్డుపైన వదలకుండా వాటిని ఇంటి వద్ద ఉంచుకోవాలని కోరుతున్నారు. ఆర్అండ్ బీ అధికారులు, పోలీసులు రోడ్డుపై నివసిస్తున్న ఆవుల యజమానులకు నోటీసులు ఇచ్చి వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పశువైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం

● ఏడీ శ్రీనివాస్

దోమకొండ, జూన్ 25:మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని ఏడీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక రైతులు జడ్పీటీసితో కలసి పశువైద్యశాలను పరిశీలించారు. వైద్యశాలలో సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో రైతులు తమ మేకలు, పశువులకు చికిత్సలు అందించాలంటే ఇబ్బందులు పడవలసి వస్తుందని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా గతంలో ముత్యంపేటకు చెందిన సిబ్బంది దోమకొండలో అందుబాటులో ఉండేవారిని కానీ అతను గత నెలలో పదవీ విరమణ పొందినట్లు ఏడీ తెలిపారు. సిబ్బంది అందుబాటులో ఉండేలా జేడీ దృష్టికి తీసుకెళ్తానని ఏడీ శ్రీనివాస్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

డిచ్‌పల్లి,జూన్ 25: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన మారుపక దత్త్రాద్రి (61) అనుమానాస్పద స్థితిలో చెరువులో పడి మృతి చెందాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం 11గంటలకు చేపలు పట్టేందుకు ఇంట్లోనుంచి వెళ్లిన దత్త్రాద్రి ఇంటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించిందని మృతదేహంపై గాయాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మారుపక లింబాద్రి మృతిపై ఎస్సై మహేశ్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ప్రకటనలో తెలిపారు.

కల్తీ విత్తనాలను అరికట్టాలి

మాక్లూర్,జూన్ 25:రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కల్తీ విత్తనాలు అరికట్టాలని, అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ అన్నారు. మంగళవారం మండలంలోని మానిక్‌బండార్ ఏఐకెఎంఎస్ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన ఎన్నికల హామీతో రైతు బంధు, రూ.2లక్షల రుణమాఫీ వెంటనే అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి ఘన స్వాగతం

కమ్మర్‌పల్లి, జూన్ 25: గత నెల అమెరిక పర్యటనకు వెళ్లి మంగళవారం తిరుగుపయనమైన బీఆర్ఎస్ మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి శంశాబాద్ ఏర్‌పోర్టులో కమ్మర్‌పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, జిల్లానాయకుడు బద్దం చిన్నారెడ్డి, మండల వైస్ ఎంపీపీ కాలేరు శేఖర్,రాజాగౌడ్, ఎంపీటీసీలు మైలారం సుధాకర్, గంగాధర్, మాజీ సర్పంచ్ ప్రభాకర్,లస్కర్‌నాయక్,ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రకాశ్ నాయక్, రేంజర్ల మహేందర్, కోనాపూర్ నాయకులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

విద్యాసంస్థలకు అంతరాయం కలిగించకూడదు

ఆర్మూర్‌టౌన్, జూన్25: బంద్, నిరసన పేరుతో విద్యాసంస్థలకు ఏలాంటి అంతరాయం కలిగించకూడదని ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల వద్ద విద్యార్థి సంఘాలు, నాయకులు వెళ్ళి సహజ సిద్ధమైన కార్యక్రమాలు ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగిస్తే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

లింగంపేటలో 13 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు

● నంబర్ ప్లేట్ లేని 25 వాహనాల సీజ్



లింగంపేటలో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

లింగంపేట,జూన్ 25: లింగంపేట మండల కేంద్రంలో మంగళవారం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీ నిర్వహించి 13డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ లింగంపేటలో 25నంబర్ ప్లేట్‌లు లేని వాహనాలను సీజ్ చేశామని, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఆయన తెలిపారు. వాహనదారులు హెల్మెట్ దరించి, పరిమిత వేగంతో వాహనాలను నడపాలని ఆయన సూచించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో సీఐ రవీందర్ నాయక్, లింగంపేట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి, గాంధారి, తాడ్వాయి, ఎల్లారెడ్డి, సదాశివనగర్, నాగిరెడ్డిపేట, ఎస్సైలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేసిన ఎస్సై

ధర్పల్లి, జూన్ 25: మండల కేంద్రానికి చెందిన కాసుల సాయిలు అనే వ్యక్తికి మంగళవారం ఎస్సై విక్రమ్ తాను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి ఎస్సై అందజేశారు. 15రోజుల క్రితం తన సాయిలు ఫోన్ చోరీకి గురైనట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి బాధితునికి ఫోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు సాయిలు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న వస్తువులను అప్పగించిన కండక్టర్



ప్రయాణికుడి సామాగ్రిని అప్పజెపుతున్న కండక్టర్

వర్ని,జూన్25: చందూర్ మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ తన ఉదారతను చాటుకున్నాడు. బోధన్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంజీవ్ రెడ్డి అనే కండక్టర్ మంగళవారం టీఎస్ 676369 బస్సులో జేబీఎస్ వరకు విధుల్లో చేరాడు. బాన్సువాడలో ఓ ప్రయాణికుడు కవర్‌లో ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు, అకౌంట్ బుక్కులు, పొలం పట్టా బుక్కులు, కొంత నగదును మరిచి బస్సు దిగి వెళ్లిపోయాడు. దీంతో వాటిని గమనించిన సంజీవ్ రెడ్డి కవర్‌ను తన వద్ద భద్రంగా దాచి పెట్టాడు. తిరుగు ప్రయాణంలో ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ఆధారంగా ప్రయాణికుడికి సమాచారం ఇచ్చి కంట్రోలర్ శరణప్ప సమక్షంలో పోగొట్టుకున్న కవర్‌ను ప్రయాణికుడి చేతికి అప్పజెప్పారు. దీంతో సంతోషించిన ప్రయాణికుడు కండక్టర్ సంజీవ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పదిఎకరాల లోపు వారికే రైతు భరోసా ఇవ్వాలి

డిచ్‌పల్లి,జూన్ 25: రైతు భరోసా ను పది ఎకరాల లోపు రైతులకు మాత్రమే ఇవ్వాలని వ్యవసాయ సాగు భూమి కి మాత్రమే రైతు భరోసా అందించాలని డీడీఏ తిర్మలప్రసాద్ రైతు నేస్తం కార్యక్రమాన్ని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పంట పండని భీడు భూములకు, వెంచర్‌లకు,శిఖం భూములకు సర్వే చేయించి దరణి నుంచి తొలగించి వ్యవసాయ శాఖ కు వాస్తవ నివేదిక అందించినప్పుడే అర్హులకు అందుతుందన్నారు. ఏడీఏ ప్రదీప్ కుమార్, ఏవో లు రాంబాబు, రవీందర్, ఈరా, దేవిక, ఏఈవోలు, విండో చైర్మన్‌లు పాల్గొన్నారు.

టీయూ సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షల తేది ప్రకటన

డిచ్‌పల్లి,జూన్ 25: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ 1,3 వ ఇంటిగ్రెటెడ్ కోర్సుల 7,9 సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షల ఫీజు జూలై 1 లోపు చెల్లించాలని 100రూ.అపరాధ రుసుమతో జూలై 4 వరకు చెల్లించవచ్చునని పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.అరుణ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించలన్నారు.

● ఎంఎడ్ పరీక్షల టైంటేబుల్ విడుదల

తెలంగాణవిశ్వవిద్యాలయ పరిధిలోని ఎంఏడ్ పరీక్షలు జూలై 5నుంచి ప్రారంభమైవుతు న్నట్లు ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతాయని సీవోఈ అరుణ తెలిపారు.

● పీజీ సెమిస్టర్ రీవాల్యూయేషన్ షెడ్యూల్ విడుదల

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ 1,3,5సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలకు హాజరైన విద్యార్థిని, విద్యార్థులు పరీక్షల విభాగం రీవాల్యూయేషన్ తేదిని ప్రకటించింది. జూలై 1 లోపు రివాల్యూయేషన్ కోరిన విద్యార్థిని విద్యార్థులు ఒక్కో పేపరు రూ.500 చెల్లించాలని సీవోఈ తెలిపారు.

హిందు మనోభావాలను దెబ్బతిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్ , జూన్25: హిందు సమాజ మనోభావాలను దెబ్బతిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని హిందు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళ వారం తహసీల్దార్ గజానన్‌కు వినతిపత్రం అందజేశారు. గత కొద్దిరోజులుగా నిర్మించిన పిరమిడ్ అక్రమకట్టడంలో వారు వ్యవహరిస్తున్న వైఖరిపై తహసీల్దార్ దర్యాప్తు చేపట్టాలని, హిందు వ్యతిరేక కార్యకలాపాలు పిరమిడ్ వారు నిర్వహించడం సమాజంసం కాదని, పిరమిడ్ కట్టడం లోపల విగ్రహాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలని లేని యేడల ఎండోమెంట్ వారు ఆదీనం తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్, జిల్లా ప్రధానకార్యదర్శి మందుల బాలు, కార్యదర్శి ఉదయ్‌గౌడ్, బోచ్‌కర్ నిఖిల్, పెద్దోళ్ళ గోపి, తదిత రులు పాల్గొన్నారు.

దివ్యాంగుల చలో హైదరాబాద్

రుద్రూరు,జూన్25: దివ్యాంగుల డిమాండ్ల సాధనకై వికలాంగుల హక్కుల పోరాట సమితి ఇచ్చిన పిలుపు మేరకు రుద్రూరు మండలం నుంచి మంగళ వారం దివ్యాంగులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు సాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా పెన్షన్ పెంచుతామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం లేదన్నారు.

కమ్మర్‌పల్లిలో బీమా చెక్కు పంపిణీ

కమ్మర్‌పల్లి, జూన్ 25: మండల కేంద్రంలోని గాంధీనగర్ వడ్డర కాలనికి చెం దిన జరుపుల గంగు ఇటీవల మరణించడంతో ఆమె చేసిన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్ బీమాక్లేమ్ 4లక్షల 37 వేల చెక్కును మంగళవారం నామిని (మృతురాలి కూతురు) మాలోత్‌సుజాతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎం నగేష్, ఆర్మూర్ బ్రాంచ్ మేనేజర్ సందీప్, ఆనంద్, స్థానికులు పూట్నూర్ రాజ శేఖర్, మలావత్ సంతోష్‌పూట్నూర్ (ధోని) రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వ్యక్తి హత్య

● దర్గా డబ్బుల విషయంలో గొడవ

ఖిల్లా, జూన్ 25 : దర్గా డబ్బుల విషయంలో జరిగిన గొడవలో వ్యక్తి దారుణంగా హత్యకు గురైన ఘటన ఆరో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ధర్మపురిహిల్స్ ప్రాంతంలో మంగళవారం వెలుగుచూసింది. 12వ డివిజన్ పరిధిలోని రంజానీబాబా దర్గాలో ఉండే హసన్(50)అనే వ్యక్తివద్ద ఉన్న డబ్బుల విషయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో గొంతువద్ద, మొఖంపై భాగాన(నుదిటిపైన)తీవ్రంగా గాయపడి ఆయన వద్ద ఉన్న సుమారు రూ.15వేలను ఎత్తుకెళ్లినట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దక్షణ మండల రూరల్ ఇన్స్‌పెక్టర్ సురేష్ నేతృత్వంలో ఆరవటౌన్ ఎస్ మొగలయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు ఉన్న ఆయన దర్గాలోనే ఉండేవాడని, తరుచు మనవరాలి వద్దకు వెళ్లి స్నానం చేసే వాడని పోలీసులు తెలిపారు. దుండగుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం ఆయన కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు చెప్పారు.

● రెగ్యులర్ ఎస్ఐ లేకపోవడంతోనే పెరుగుతున్న నేరాలు

నగరంలోని ఆరో టౌన్ పోలీసు స్టేషన్‌లో రెగ్యులర్ పోస్ట్ ఎస్ఐ లేకపోవడంతో ఈ ప్రాంతంలో నేరాలు పెరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. గత కొంత కాలంగా సద్దుమణిగిన గొడవలు, కత్తుల దాడు లు ఇటీవల అదే పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో తిన్న బిల్లు విషయంలో జరిగిన గొడవలో సైతం కొందరు కత్తులతో, కర్రలతో దాడులు చేసుకున్నారు. వారిని అడ్డుకోవడానికి వెళ్లిన పోలీసులపైన దాడిచేయడానికి యత్నించిన ఘటన సైతం జరిగింది. దీంతో పోలీసులు వారిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ పోలీసు స్టేషన్ నగరశివారులో ఉండడంతో పాటు ఇక్కడ నేరప్రవృత్తి కార్యకలాపాలు అనేకంగా జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయంలో స్థానికులు జీవనం సాగిస్తున్నారు. గతంలో రేషన్ బియ్యం అక్రమ రవాణ విషయంలో రౌడీషీటర్లు కత్తులతో పరస్పర దాడులు చేసుకుని హత్యలకు పాల్పడ్డారు. దీంతో అప్పటి పోలీసు అధికారులు ఆ ప్రాంతంపై సీరియస్‌గా ఉండి దాడులకు పాల్పడే వారిని అరెస్టు చేసి కేసులు నమోదు చేయడమే కాకుండా జైలుకు పంపిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఇటీవల ఆ పోలీసు స్టేషన్‌కు రెగ్యులర్‌గా విధులు నిర్వహించే ఎస్ఐతో పాటు మరికొంత మంది సిబ్బందిని నియమించకపోవడం, పరిధి పెద్దదిగా ఉండడం నేరాలు చేయడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసు బాస్ ఈ ప్రాంతంపై దృష్టిపెట్టి రెగ్యులర్ ఎస్ఐతో పాటు మరికొంత మంది సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

పొదుపు సంఘాలకు అందని వడ్డీ డబ్బులు

● ఐదేళ్ల నుంచి చెల్లించని ప్రభుత్వాలు ● మూడు మున్సిపాలిటీలలో సుమారు రూ. 6.20 కోట్ల బకాయిలు

ఎల్లారెడ్డి, జూన్ 25: జిల్లాలోని మున్సిపాలిటీలలో స్వయం సహాయక పొదుపు సంఘాలకు కొన్నేళ్ల నుంచి ప్రభుత్వాలు వడ్డీ డబ్బులు చెల్లించడం లేదు. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో పొదుపు సంఘాలకు 2019-20 సంవత్సరం నుంచి వడ్డీ రావాల్సి ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కలుపుకుంటే ఐదు సంవత్సరాల వడ్డీ రూ.6.20 కోట్ల బకాయి పేరుకుపోయింది. వడ్డీ డబ్బులు ఎప్పుడు ఇస్తారు కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఆర్థిక సంవత్సరం ఇటీవలే ముగిసిన కనీసం వడ్డీల డబ్బులను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయడం లేదు. వడ్డీ లేని రుణం ఇస్తున్నామని చెబుతున్నారే తప్పా బ్యాంకులు వసూలు చేస్తున్న వడ్డీని తిరిగి ఇవ్వడంలో ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయి. దీంతో జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో సుమారు 2370 పొదుపు సంఘాల మహిళలకు ఎదురు చూపులు తప్పడం లేదు.

● కొత్త సంఘాల ఏర్పాటుపై వడ్డీ ఎఫెక్ట్

ప్రతి సంవత్సరం మెప్మా ఆధ్వర్యంలోని సిబ్బంది కొత్తగా మహిళా సంఘాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక్కో సంఘం ఏర్పాటు చేయాలంటే 10 మంది మహిళలు తప్పనిసరిగా ఉండాల్సిందే. ఒక్కో మహిళా రూపాయలు చొప్పున ఏర్పాటు బ్యాంకులో పొదుపు చేసిన తరువాత ఆరు నెలలకు రుణమిస్తారు. కాని గత నాలుగేళ్లుగా పొదుపు సంఘాలకు ప్రభుత్వాలు వడ్డీ విడుదల చేయకపోవడంతో కొత్తగా సంఘాలు ఏర్పాటు చేసుకునే వాళ్లు ప్రతినెల 10వ తేదిలోగా చెల్లించకుంటే అధిక వడ్డీ పడుతుందని భయంతో ముందుకు రావటే_దని సమాచారం.

● అధికారుల వద్ద లేని సమాచారం..

జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో పొదుపు సంఘాలకు రావాల్సిన వడ్డీ బకాయిల డబ్బులు ఎప్పుడు విడుదల చేస్తారని మహిళలు ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. మున్సిపల్ కార్యాలయాల్లో మెప్మా సిబ్బందిని వడ్డీ గురించి అడుగుతున్న సిబ్బంది వద్ద కూడా ఇలాంటి సమాచారం ఉండటం లేదని కనీసం మెప్మా జిల్లా అధికారుల వద్ద కూడా సమాచారం లేదని మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వాలు స్పందించి మహిళా సంఘాలకు వడ్డీ డబ్బులు విడుదల చేయాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

శెట్పల్లిసంగారెడ్డి పాఠశాల ఆవరణలో వంటా వార్పుతో నిరసన

లింగంపేట, జూన్ 25 : లింగంపేట మండలంలోని శెట్పల్లి_సంగారెడ్డి పాఠశాల ఆవరణలో పాఠశాలకు స్థలాన్ని ఇచ్చిన బాధితులు స్థలం కోసం పాఠశాల ముందు వంటా వార్పుతో నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామ శివారులోని సర్వేనంబర్ 1248లోని 34గుంటల భూమిని అప్పట్లో గ్రామపంచాయితీ తీర్మాణంతో పాఠశాల నిర్మాణం కోసం అందించారు. గ్రామానికి చెందిన ఉప్పేరి మనెమ్మ, బర్ల భరత మ్మ, ఉప్పరి గంగమణి, కళావతి, అనుసమ్మ, దుర్గయ్యలకు చెందిన భూమని పాఠశాల నిర్మాణానికి ఇవ్వగా పాఠశాలకు ఇచ్చిన స్థలానికి బదులుగా మరోచోట ప్రభుత్వ భూమిని ఇస్తామని అప్పటి పంచాయితీ పాలకవర్గం, రెవెన్యూ అధికారులు మాట ఇచ్చారు. దీంతో వారు స్థలాన్ని పాఠశాలకు ఇవ్వగా సంవత్సరాలు గడిచినా స్థలానికి బదులు స్థలం ఇవ్వకపోవడంతో వారు రెవెన్యూ అధికారుల చుట్టు, ప్రజాప్రతి నిధుల చుట్టు తిరుగుతున్నా వారికి భూమికి బదులు భూమి చూపక పోవడంతో వారు పాఠశాల ఆవరణలోనే వంట చేసుకుని అక్కడే భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇట్టి భూమికి ఇప్పటికి రైతు బందు డబ్బులు వీరి ఖాతాలోనే పడుతున్నాయని వారు తెలిపారు. ఈ విషయమై ఎంఈవో రామస్వామిని వివరణ కోరగా పాఠశాలకు ఇచ్చిన స్థలానికి బదులు వారికి మరోచోట వ్యవసాయ భూమికి చూపకపో వడంతో సమస్య నెలకొందని ఆయన తెలిపారు. సమస్యను తహసీల్దార్ నరెందర్ దృష్టికి తీసువెళ్లగా బుధవారం ఆర్ఐను పంపి విచారించ నున్నట్లు తెలిపారని ఆయన తెలిపారు.

ఈటెల ప్రమాణ స్వీకారానికి ఢిల్లీకి వెళ్లిన బీజేపీ నేతలు

ఎడపల్లి, జూన్ 25: మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికై ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ వెళ్లిన ఈటెల రాజేందర్‌ను ఢిల్లీలో మంగళవారం ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన బీజేపీ ఓబీసీ జిల్లా నేత, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు యాసాడ నర్సింగ్ ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు బోధన్ ముదిరాజ్ సంఘం నాయకులు గంగాథర్, అదిలాబాద్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శివన్న తదితరులు ఉన్నారు.



ఈటెలను కలిసిని బిజేపి నేతలు

పోలీసుల స్పెషల్ డ్రైవ్



మామిడిపల్లిచౌరస్తాలో వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్, జూన్25: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో మంగళవారం పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్‌ప్లేట్ లేని వాహనాలు, ట్రిబుల్ డ్రైవింగ్‌లో దొరికిన వాహనాలను సీజ్ చేయడం జరిగిందని, అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టార్ వివేకానందరెడ్డి, ట్రాఫిక్ సీఐ ఓడి.రమేష్, స్థానిక ఎస్సై అశోక్, తదితరులు పాల్గొన్నారు.


డైలీ మార్కెట్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

డైలీ మార్కెట్ పరిశీలన

కామారెడ్డి టౌన్, జూన్ 25: కామారెడ్డి పట్టణంలోని డైలీ మార్కెట్, సుభాష్‌రోడ్డులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. సుభాష్‌రోడ్డులో ఉన్న ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతామని తెలిపారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చిరు వ్యాపారులు రోడ్డుమీద ఉండకుండా చూడాలన్నారు. అంతకుముందు అశోక్ నగర్ కాలనీలోని హనుమాన్ టెంపుల్‌లో నూతన బోర్ మోటార్‌ను ప్రారంభించారు. పట్టణంలో నీటి సమస్యను తీర్చేందుకు ట్యాంకర్లను ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్‌లు పాత శివకృష్ణమూర్తి, నరేందర్, చాట్ల వంశీ నాయకులు ముప్పారపు ఆనంద్, రామ్మోహన్, పంపరి శ్రీను, ప్రసన్న, రాజు నాయక్, అంజల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభం

గాంధారి, జూన్ 25: మండల కేంద్రంలోని సీసీరోడ్డు పనులను మంగళవారం జడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీటీసీ తూర్పు రాజులు ప్రారంభించారు. మసీదులో రోడ్డు కోసం ఎంపీటీసీ నిధులు రూ.2 లక్షలతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలోనే అన్ని మటి రోడ్డులను సీసీరోడ్డు లాగా చేస్తామని జడ్పీటీసీ పేర్కొన్నారు. పనులను కాంట్రాక్టర్ నాణత్యగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, సింగిల్‌విండో చైర్మన్ సాయికుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్, లైన్ రమేష్, సంతోష్, బాబా, ఫైమద్, రవి, భాగ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్

సదాశివనగర్, జూన్ 25: గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో అల్యూమిని మీట్, గ్రాడ్యుయేషన్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాల్ జనార్దన్‌రావు, కామారెడ్డి ప్రభుత్వ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ వీరయ్య హాజరై మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ రేణుక, అకాడమిక్ కో ఆర్డినేటర్ వనజ, కల్చరల్ కో ఆర్డినేటర్ ఉదయని తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం

● ఏడీ శ్రీనివాస్

దోమకొండ, జూన్ 25: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని ఏడీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక రైతులు జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్‌తో కలసి పశువైద్యశాలను పరిశీలించారు. వైద్యశాలలో సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో రైతులు తమ మేకలు, పశువులకు చికిత్స అందించాలంటే ఇబ్బందులు పడవలసి వస్తుందని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా గతంలో ముత్యంపేటకు చెందిన సిబ్బంది దోమకొండలో అందుబాటులో ఉండేవారిని కానీ అతను గత నెలలో పదవీ విరమణ పొందినట్లు ఏడీ తెలిపారు. సిబ్బంది అందుబాటులో ఉండేలా జేడీ దృష్టికి తీసుకెళ్తానని ఏడీ శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

నేడు పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

కామారెడ్డి టౌన్, జూన్ 25: కామారెడ్డి జిల్లాలో బుధవారం అన్ని పాఠశాలలకు బంద్ ప్రకటిస్తున్నామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రోహిత్ తెలిపారు. ప్రభుత్వాలు మారినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మారడం లేదని స్కావెంజర్‌లు లేక, సరిపడా క్లాస్ రూమ్‌లు లేక విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా తల్లిదండ్రుల దగ్గర ఫీజులు దండుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ అన్ని విద్యా సంస్థలకు బంద్ ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని విద్యాసంస్థలు ఈ బంద్‌కు సహకరించాలని కోరారు.

నేడు కళాభారతిలో కిసాన్ మేళా

కామారెడ్డి టౌన్, జూన్ 25: పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, డెయిరీ టెక్నాలజీ కళాశాల, జాతీయ మాంస పరిశోధన సంస్థ సంయుక్తంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బుధవారం కళాభారతిలో కిసాన్‌మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ శరత్‌చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో వ్యవసాయశాఖ, అనుబంధ శాఖలైన పశు సంవర్ధకశాఖ, హార్టికల్చర్, ఫిషరీస్, పరిశ్రమల శాఖ, విజయ డెయిరీ, నాబార్డ్ తదితర సంస్థలు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వివిధ స్కీంలను వివరించడంతో పాటు పరికరాలను, ఉత్పత్తులను ప్రదర్శిస్తారని తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ విత్తన సంస్థలు, ఎరువుల సంస్థలు, వ్యవసాయ పరికరాల సంస్థలు, ట్రాక్టర్ సంస్థలు పాల్గొంటాయన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీబీపేటలో తైబజార్ వేలం

బీబీపేట, జూన్ 25: మండల కేంద్రంలోని వారంతపు సంత తైబజార్ వేలంను మంగళవారం నిర్వహించారు. ఇందులో రూ.1,74,000 లకు చాట్ల లింగం అనే వ్యక్తి దక్కించుకున్నారని పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు

● ఒకరు మృతి, 28 మందికి గాయాలు


క్యాసంపల్లిలో బస్సు ఢీకొట్టడంతో ధ్వంసమైన లారీ


మృతి చెందిన అప్సర్‌ఖాన్


గాయపడిన క్షతగాత్రులు

కామారెడ్డి టౌన్, జూన్ 25: కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి గ్రామ పరిధిలో గల ఎన్‌హెచ్ 44 రోడ్డుపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్‌ఐ రాజు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి డైమండ్ ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సులో 34 మంది ప్రయాణికులు ఎన్‌హెచ్ 44 రోడ్డు గుండా హైదరాబాద్ వెళ్తు న్నారు. అదేదారిలో మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు గోధుమల లోడ్‌తో లారీ వెళ్తుండగా లారీలో డీజిల్ అయిపోవడంతో క్యాసంపల్లి గ్రామ పరిధిలో తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఆగిపోయింది. ఆగిఉన్న లారీకి ఎలాంటి ఇండికేటర్స్ వేయకపోవడంతో బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న అప్సర్‌ఖాన్(26) అక్కడికక్కడే మృతి చెందగా మరో 28 మంది గాయాల పాలయ్యారు. ఇందులో బస్సు డ్రైవర్ షేక్ రఫీక్‌కు కుడి కాలు విరుగగా, ముబిన్ అనే వ్యక్తికి తలకు తీవ్రగాయమైంది. లారీని బస్సు బలంగా ఢీ కొట్టడంతో అందులోని గోధుమ సంచులు పదడుగుల దూరం వరకు చెల్లాచెదురుగా పడిపోవడం, బస్సు ముం దుభాగం పూర్తి దెబ్బతినడంతో పాటు భారీ ట్రాఫిక్ జాం ఏర్పడింది. స్థానికులు దేవునిపల్లి పోలీసులకు సమా చారం అందించడంతో సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రు లను కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో పాటు బస్సును అక్కడి నుంచి మరో ప్రాంతానికి మార్చి ట్రాఫిక్ సమస్య లేకుండా చూశారు. బస్సులో ప్రయాణిస్తున్న వారంతా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందినవా రే ఉన్నారు. ఈ ప్రమాదంపై మృతుడు అప్సర్‌ఖాన్ సోదరుడు అప్జల్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పోచారం రాకను స్వాగతిస్తున్నాం

● మండల కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడటౌన్, జూన్ 25: మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావడాన్ని తాము మన స్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ నార్ల రత్నకుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో సీనియర్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పోచారం ఇంటికెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం, అందుకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అంగీకరించి పార్టీలో చేరడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరిందన్నారు. పోచారం అభివృద్ధికి చిరునామాగా నిలిచి బాన్సువాడ ప్రజల మన్ననలు పొందారన్నారు. రాబోయే రోజుల్లో బాన్సువాడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలను అందరిని కలుపుకుపోవాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో పాత కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మెన్ నార్ల సురేష్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు అఫ్రోజ్, మాజీ పట్టణాధ్యక్షుడు మాసాని రవీందర్‌రెడ్డి, మాసాని అశోక్‌రెడ్డి, ఉడుత గంగాధర్ తదితరులున్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు


ముజీబుద్దీన్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హజ్‌యాత్ర పూర్తి చేసుకున్న ముజీబుద్దీన్‌కు సన్మానం

కామారెడ్డి రూరల్, జూన్ 25: కామారెడ్డి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంకే ముజీబుద్దీన్ హజ్‌యాత్ర పూర్తి చేసుకుని వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి శ్రీనివాస్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవియాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నాగిరెడ్డిపేట, జూన్ 25: హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి హాస్టల్ వార్డెన్ రాములుకు సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కాగా భోజనం రుచికరంగా లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఆయన హాస్టల్ వార్డెన్ రాములును కోరారు. ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని హాస్టల్ వార్డెన్ జడ్పీటీసీకి వివరించారు. అనంతరం ఆయన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఉదయం జరిగే ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రార్థనలో ప్రిన్సిపాల్‌తో పాటు మరో ఏడుగురు టీచర్లు పాల్గొనాల్సి ఉండగా, ప్రార్థనలో నలుగురు ఉపాధ్యాయులతో పాటు ఒక పీఈటీ మాత్రమే పాల్గొన్నారు. ఉపాధ్యాయుల గైర్హాజర్ గురించి ఇంచార్జి ప్రిన్సిపాల్ అనురాధను జడ్పీటీసీ ప్రశ్నించగా పాఠశాల ప్రిన్సిపాల్ వీణ సాలరీ బిల్లు కోసం వెళ్లారని ముగ్గురు టీచర్లు సెలవుపై ఉన్నట్లు ఆమె తెలిపారు. ఇక మీదట పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ సమయ పాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మనోహర్‌రెడ్డి సూచించారు. అక్కడి నుంచి మోడల్ స్కూల్ చేరుకుని రికార్డులను పరిశీలించారు.


నాగిరెడ్డిపేట హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి


నల్లబ్యాడ్జీలు కట్టుకుని నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

'ప్రజాస్వామ్యానికి జూన్ 25 చీకటిరోజు'

కామారెడ్డిటౌన్, జూన్ 25: ప్రజాస్వామ్యానికి జూన్ 25 చీకటి రోజు అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో,నోటికి రిబ్బన్‌లు కట్టుకుని బీజేపీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1977మార్చి 21 వరకు ఇందిరాగాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైలులో పెట్టి ప్రతికలను సైలెన్స్ చేశారన్నారు. వాస్తవాలను చెప్పేందుకు ప్రయత్నించిన పత్రికలపై తీవ్ర నిర్బంధం విధించారని, ప్రశ్నించే మేదావుల గొంతునొక్కారని అన్నారు. 1975 జూన్ 25 చరిత్రలోనే చీకటి రోజుగా నిలిచి పోయిందని అన్నారు. దేశంలో అంతర్గత అస్థిరతను, అశాంతిని కారణంగా చూపుతూ జాతీయ అత్యవసర పరిస్థితిని ఇందిరాగాంధీ ప్రకటించి భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కిందని అన్నారు. ఎన్నికలు వాయిదావేయడం, ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను ఉక్కుపాదంతో అణిచివేయడం,పత్రిక స్వేచ్ఛపై ఆంక్షలు విధించడంతో పాటు కొన్నిచట్టాలను ప్రభుత్వానికి అనుకులంగా మార్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్‌జైన్, ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, నాయకులు భరత్, శ్రీకాంత్,చారి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బాన్సువాడ మున్సిపాలిటీలో తైబజార్ వేలం

బాన్సువాడ టౌన్, జూన్ 25: బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం తైబజార్ వేలం నిర్వహించారు. మేకల సంతను 33 లక్షల 10 వేలు, వారాంతపు సంత 10 లక్షల 10 వేలు, రోజువారి సంత 7 లక్షలకు వేలం పాటలో గుత్తేదారులు దక్కించుకున్నారు. ఈ వేలంలో బాన్సువాడ మున్సిపాలిటీకి గత సంవత్సరం కంటే 12లక్షల 79వేల ఆదాయం పెరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మెన్ జంగం గంగాధర్, వైస్ చైర్మెన్ జుబేర్, కమిషనర్ శ్రీహరిరాజు, పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.


హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్థులు

వర్షాలు కురువాలని పూజలు

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), జూన్ 25: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని, చిన్నా పెద్దలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో విగ్రహాలకు నీళ్లతో అభిషేకం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమై, మిర్గం పండుగ అయిపోయి చాలా రోజులైందని, వరుణ దేవుడి కరుణ లేదని, ఇప్పటికైనా వర్షాలు బాగా కురిసి పాడి పంటలు పుష్కలంగా పండాలని దేవున్నిప్రార్థించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

బీర్కూర్, జూన్ 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రజాప్రతినిధులు, నాయకులు కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకుని కళాశాలకు మంచి పేరు ప్రతిష్ఠలను తీసుకురావాలని విద్యార్థులతో పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సభ్యుడు సందీప్, కో ఆప్షన్ సభ్యుడు ఆరీఫ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంపోస్టు షెడ్‌లను వినియోగించాలి

బీర్కూర్, జూన్ 25: పారిశుధ్యం మెరుగుపరిచేందుకు నిర్మించిన కంపోస్టు షెడ్లను నిరుపయోగంగా మారిస్తే సహించేది లేదని, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించాలని ఎంపీవో అనిత గ్రామ పంచాయితీ సెక్రటరీలకు సూచించారు. మంగళవారం ఆమె రైతునగర్‌లో కంపోస్టు షెడ్‌ను సందర్శించారు. సేంద్రీయ ఎరువుల తయారీ తీరును పరిశీలించారు. ఇండ్ల నుంచి సేకరించిన ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయాలు, ఎలక్ట్రానిక్, ప ప్లాస్టిక్ బాటిళ్ళు తదితర వ్యర్థాలను ఎక్కడ బడితే అక్కడ పారేయవద్దని, నేరుగా షెడ్‌కు తీసుకురావాలన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం

బీర్కూర్, జూన్ 25: మండల తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో మంగళవారం శ్రవణ నక్షత్రం సందర్భంగా గోదా సమేత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కళ్యాణం వైభవంగా జరిగింది. బాన్సువాడకు చెందిన దేవి కృష్ణ ప్రసాద్ దంపతులు ఎక్లాస్‌పూర్ క్యాంప్‌కు చెందిన రవీందర్ బాబు, మాధవి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణాన్ని జరిపించారు

ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి , ముఖ్యనాయకులను కలిసిన ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడటౌన్, జూన్ 25: దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ ముఖ్యమంత్రి అధికార నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీలతో పాటు ముఖ్య నాయకులను మాజీ శాసన సభాపతి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డిలు ఉన్నారు. అలాగే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీని సైతం కలిశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తాడ్వాయి, జూన్ 25: మండలం ఎర్రపహాడ్ గ్రామశివారులో మంగళవారం జరిగినరోడ్డు ప్రమాదంలో కరడ్‌పల్లి గ్రామానికి చెందిన పడమటి భీమయ్య(70) అనే వృద్ధుడు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈతనాడల కోసం మంగళవారం ఉదయం కరడ్‌పల్లి గ్రామం నుండి ఎర్రపహాడ్ గ్రామశివారులోకి రాగా పక్కన ఉన్న ఈతనాడులను కోస్తున్నసమయంలో ఎర్రపహాడ్ గ్రామం నుంచి అతివేగంగా వచ్చిన కారు వృద్ధుడిని ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆయనను వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య,ఇద్దరు కూమారులు ఉన్నారు. మృతుడు కూలీ పనులు చేసుకుంటూ గ్రామంలో జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. అతిపేదరికంలో ఉన్న కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ విషయమై తాడ్వాయి పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి		బాన్సువాడ	
శాంతి	ఓసీ	మహేశ్వరి	ఓఎంజీ
దర్శన్	మహారాజ	వెంకటేశ్వర	నింద
ప్రియా 70	ఓఎంజీ		

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

